ఈనాడు విజయనగరం

శుక్రవారం అక్టోబరు 4, 2024



సిరిమాను తయారీ ప్రారంభం

పైడితల్లి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం సిరిమానోత్సవం. ఇందుకు సంబంధించిన వృక్షాన్ని డెంకాడ మండలం పెదతాడివాడలో గుర్తించి, హుకుంపేటలోని పూజారి ఇంటి వద్దకు తీసుకొచ్చారు. గురువారం నెల్లిమర్లకు చెందిన వడ్రంగులు సిరిమానుగా తయారు చేసే పనులు ప్రారంభించారు. పూజారి బంటుపల్లి వెంకటరావు పర్యవేక్షిస్తున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్

స్వర్ణ శోభితం.. కనకమహాలక్ష్మి

శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొలి రోజు గురువారం చీపురుపల్లి కనకమహాలక్ష్మి స్వర్ణకవచాలంకృత మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, హోమం, ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

– న్యూస్‌టుడే, చీపురుపల్లి



అమ్మవారికి స్వర్ణకవచాలంకృత అలంకారం

పూర్తిస్థాయిలో వసతులు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అంబేడ్కర్ కోరారు. ప్రతి సాంస్కృతిక వేదిక వద్ద పండగ వాతావరణం ఉట్టిపడేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. గురువారం తన ఛాంబర్లో ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. పండగ మూడు రోజులు విద్యుత్తు సరఫరా ఉండేలా చూడాలని, ప్రభుత్వ భవనాలు, ఉద్యానాలు, ప్రధాన కూడళ్లు విద్యుత్తు దీపాలతో దేదీప్యమానంగా కనిపించాలన్నారు. విజ్ఞాన ప్రదర్శనలకొచ్చే విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని ఆదేశించారు. డీఆర్వో అనిత, డీఈవో ఎన్. ప్రేమకుమార్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు

విజయనగరం కోట, న్యూస్‌టుడే: దసరా, విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి సిరిమానోత్సవం సందర్భంగా భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ తెలిపారు. అక్టోబరు 4 నుంచి 16 వరకు నడుస్తాయని, 10, 11న హైదరాబాద్, విజయవాడ నుంచి విజయనగరానికి వస్తాయని చెప్పారు. విశాఖ, బొబ్బిలి, పార్వతీపురం, చీపురుపల్లి, అనకాపల్లి డిపోల నుంచి కూడా సర్వీసులు తిప్పనున్నట్లు చెప్పారు. ప్రయాణికులు apsrtconline.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చని సూచించారు.

నకిలీ పత్రంతో స్వాహా

ఈనాడు–విజయనగరం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వికలాంగ పింఛను రూ.3 వేల నుంచి రూ.6 వేలు చేసింది. కొందరు గతంలో అడ్డదారిలో నకిలీ వైకల్య ధ్రువపత్రాలు పొంది దాని ద్వారా పింఛను అందుకుంటున్నట్లు గుర్తించి ఇప్పటికే విడతల వారీగా జిల్లా అధికారులకు జాబితా పంపిస్తోంది. ఈ నేపథ్యంలో ధ్రువపత్రాలు పునఃపరిశీలన చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో అనర్హుల గుండెల్లో గుబులు పుడుతోంది.

వైకాపా ప్రభుత్వ హయాంలో కొంతమంది దళారులు తక్కువ శాతం వైకల్యం ఉన్న వారి నుంచి రూ.30 వేల వరకు తీసుకొని ధ్రువపత్రం మంజూరు చేయించారు. ఇదంతా విజయవాడ కేంద్రంగా సాగిందని వినికిడి. విజయవాడ, రాయలసీమ జిల్లాలకు చెందిన కొందరు వైద్యులతో ఇక్కడి వారికి ధ్రువపత్రాలు జారీ చేయించారు. వాటికి ఐడీ సృష్టించి పింఛనుకు అవసరమైన వైకల్య శాతం నమోదు చేసి నేరుగా సచివాలయాలకు పంపించారు. అక్కడ సిబ్బంది డౌన్‌లోడ్ చేసుకుని పింఛను మంజూరు చేశారు. రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాల్లోనూ కొన్ని ముఠాలు నకిలీ ధ్రువపత్రాలిచ్చి సొమ్ము చేసుకున్నాయని సమాచారం.

‘సారూ.. గతంలో రూ.30 వేలు ఇచ్చి నకిలీ ధ్రువపత్రం పొందాం. ఇప్పుడు ప్రభుత్వం మారింది. ధ్రువపత్రాల పునః పరిశీలన అంటున్నారు. మళ్లీ దొంగపత్రం వచ్చేలా చూడండి.’

– వైద్య ఆరోగ్య శాఖతో సంబంధం ఉన్న దళారీతో ఒక వ్యక్తి వేడుకోలు.



దళారుల రంగ ప్రవేశం

జిల్లాలో నకిలీ వైకల్య ధ్రువపత్రాలతో ప్రస్తుతం పింఛన్లు అందుకుంటున్న వారు ఎక్కువగానే ఉన్నట్లు అంచనా. వీరిని తొలగించి అర్హులైన కొత్త వారికి మంజూరు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు గుర్తించిన వారికి సంబంధించిన ధ్రువపత్రాలను మరోసారి పరిశీలించాలని ఎంపీడీవోలు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించింది. విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి అందిన జాబితా ప్రకారం.. ఎప్పటికప్పుడు పునఃపరిశీలన పూర్తి చేసి నివేదికలు పంపిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం ధ్రువపత్రాలు తయారు చేసి ఇప్పిస్తామని, అన్నీ తాము చూసుకుంటామంటూ కొందరు దళారులు రంగ ప్రవేశం చేశారు. వైకాపా పాలనలో పెద్ద ఎత్తున నకిలీ ధ్రువపత్రాలు జారీ అయ్యాయి. రాజకీయ ఒత్తిళ్లతో కొంత మంది వైద్య నిపుణులు వైకల్య శాతం పెంచినట్లు తెలిసింది. స్థానికంగా ఇచ్చిన వాటి కంటే ఇతర జిల్లాల నుంచి వచ్చినవే ఎక్కువ ఉన్నాయని సమాచారం.

జిల్లా	దివ్యాంగ పింఛన్లు	ప్రతి నెలా పంపిణీ (రూ.కోట్లలో)
విజయనగరం	37,323	22.39

ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం: ప్రభుత్వం నుంచి తమకు అందిన పేర్లు గల వారి వైకల్య శాతం, వారికి గతంలో మంజూరు చేసిన ధ్రువపత్రాల పునఃపరిశీలన చేసి నివేదిక పంపిస్తున్నాం.

- డాక్టర్ అప్పలనాయుడు, సూపరింటెండెంట్, విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రి

బస్సు పాస్‌ల జారీలో అంతరాయం

విజయనగరం కోట, న్యూస్‌టుడే: జిల్లా పరిధిలోని విద్యార్థుల బస్సు పాస్‌లు, ఎంఎస్‌టీ పాస్‌ల జారీ రెండు రోజుల పాటు నిలిచిపోనుందని, ఈ నెల 7 నుంచి పునః ప్రారంభమవుతుందని విజయనగరం డిపో ప్రబంధకుడు జె. శ్రీనివాసరావు తెలిపారు. వెబ్‌సైట్‌ను నవీకరిస్తున్న నేపథ్యంలో 5, 6వ తేదీల్లో పనిచేయదని వివరించారు.

ప్రజల కోసం పోలీసు వెబ్‌సైట్



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: పోలీసుల సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. https://vizianagarampolice.ap.gov.in/ ద్వారా తమ శాఖ చేపడుతున్న కార్యక్రమాలు, విధులు, సేవలు.. తదితర వివరాలను సులువుగా తెలుసుకోవచ్చన్నారు. గురువారం తన కార్యాలయంలో అధికారికంగా వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. అనంతరం సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ప్రస్తుతానికి శాఖ సమాచారం, స్టేషన్ల అధికారుల చరవాణి నంబర్లు, ఉన్నతాధికారుల పేర్లు తదితర వివరాలు అందుబాటులో ఉంచామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలు, వాటి పరిష్కారం, స్థితిని కూడా తెలియజేస్తామని వెల్లడించారు. సైబర్ నేరాలపై అప్రమత్తత, అవగాహన కార్యక్రమాలు, ప్రకటనలు, మహిళల భద్రత, బాల్య వివాహాలు, మాదక ద్రవ్యాల నియంత్రణ తెలుసుకోవచ్చని చెప్పారు. అదనపు ఎస్పీ పి.సౌమ్యలత పాల్గొన్నారు.

అమ్మలగన్నమ్మా.. ఆదుకోవమ్మా



ఒమ్మిలో పసుపు కొమ్ములతో అమ్మవారు



విజయనగరంలోని వైఎస్సార్ నగర్‌లో అలంకరణ


ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దసరా నవరాత్రి ఉత్సవాలు గురువారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల్లో అమ్మవారు మండపాల్లో కొలువుదీరారు. ఈ సందర్భంగా తల్లికి ప్రత్యేక పూజలు జరిగాయి. వివిధ దేవాలయాల్లో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం రింగురోడ్డు, నెల్లిమర్ల, జియ్యమ్మవలస





ఎస్.కోటలోని దుర్గాదేవికి పట్టణానికి చెందిన ఎ.రమేష్, స్వాతి దంపతులు గురువారం రూ.2.70 లక్షల విలువైన వెండి కిరీటం బహూకరించారు. ఊరేగింపుగా తీసుకొచ్చి, ఆలయ కమిటీకి ఇచ్చారు. అనంతరం తల్లికి అలంకరించారు. – న్యూస్‌టుడే, ఎస్.కోట



జియ్యమ్మవలస మండలం చినమేరంగిలో ఆకట్టుకుంటున్న మండపం

గత ప్రభుత్వ నిర్వాకం.. సచివాలయానికి తాళం



తాళం వేయడంతో మూతపడిన కొండపాలెం- 3 సచివాలయం



అసంపూర్తిగా భవనం

గరివిడి, న్యూస్‌టుడే: నెలల తరబడి అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో గ్రామ సచివాలయానికి భవన యజమాని తాళం వేసిన సంఘటన గురువారం గరివిడి మండలం కొండపాలెం (గరివిడి) పంచాయతీలో చోటుచేసుకుంది. ఈ పంచాయతీలో 3వ సచివాలయానికి సొంత భవనం లేదు. ఫేకర్ పరిశ్రమ కార్మికుల కాలనీలో ఒక ఇంటిని నెలకు రూ.8 వేలకు అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నారు. గత 11 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో ఇంటి యజమాని భవనం తలుపులకు, గేటుకు తాళాలు వేశారు. విధులకు వచ్చిన సిబ్బంది గేటు బయటే నిల్చోవాల్సి వచ్చింది. ఈ విషయాన్ని వారు కొండపాలెం (గరివిడి) పంచాయతీ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన యజమానితో మాట్లాడారు. త్వరలో బకాయిలు చెల్లిస్తామని తాళం తీయాలని కోరినా ఆయన ససేమిరా అనడంతో సిబ్బందిని పంచాయతీ కార్యాలయానికి రప్పించి.. అక్కడే విధులు నిర్వహించుకునే ఏర్పాట్లు చేశారు. పంచాయతీ సాధారణ నిధుల నుంచి సచివాలయానికి అద్దె చెల్లించాల్సి ఉందని, నిధుల కొరత కారణంగా కట్టలేకపోయామని శ్రీనివాస్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

పనులు పూర్తిచేయకే..

కొండపాలెం-3 సచివాలయానికి ఈ పరిస్థితి రావడానికి గత వైకాపా ప్రభుత్వ నిర్వాకమే కారణం. రూ.40 లక్షలతో ఈ సచివాలయ భవన నిర్మాణానికి 2020 జనవరిలో పనులు ప్రారంభించినా పూర్తి చేయలేదు. భవనం పైకప్పు వేసి వదిలేశారు. ప్లాస్టింగులు, గచ్చులు, తలుపులు, కిటికీల తదితర ప్రక్రియలు పూర్తికాలేదు. నిర్మాణం పూర్తయి ఉంటే అద్దె భవనంతో ఈ అవస్థలు ఉండేవి కావని గ్రామస్థులతో పాటు సిబ్బంది వాపోతున్నారు. పెండింగు పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆదరిద్దాం.. ఆప్యాయత పంచుదాం

జీవవైవిధ్యం.. మనిషి మనుగడకు అత్యంత కీలకం. ఆధునిక యుగంలో మనకు తెలిసిన ఎన్నో జంతుజాతులు కనుమరుగైపోతున్నాయి. జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధి చేయడం, వాటి హక్కులను కాపాడడమే లక్ష్యంగా ఏటా అక్టోబరు 4న ప్రపంచ జంతు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పరిస్థితిపై కథనం.

– న్యూస్‌టుడే, గరివిడి



పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న పశు సంవర్ధక శాఖ జేడీ

నేడు అంతర్జాతీయ జంతు దినోత్సవం

జిల్లాలో పశుగణాల సంఖ్య

ఆవులు	:	3,77,960
గేదెలు	:	97,845
గొర్రెలు	:	4,48,154
మేకలు	:	1,56,511
పందులు	:	5,404
కోళ్లు	:	39,32,896

పాడి పరిశ్రమకు మళ్లీ జీవం

జిల్లాలో ప్రధాన ఆదాయ వనరు పాడి పరిశ్రమ. వ్యవసాయ రంగంలో కరవు కాటకాలు వాటిల్లినపుడు రైతులను ఆదుకొనే ఈ పరిశ్రమను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. బీమా పథకాన్ని పాడెక్కించింది. పరిహారం బకాయిలు రూ.11.14 కోట్లు లబ్ధిదారులకు చెల్లించకుండా నిలిపివేసింది. మినీ గోకులాలకు మంగళం పాడేసింది. పశు వైద్యసేవలను నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ ఊపిరి పోసేలా పలు నిర్ణయాలు తీసుకుంది. ఉమ్మడి జిల్లాలో రాయితీపై 1,075 మినీ గోకులాల యూనిట్లు మంజూరు చేసింది. పశు బీమా పథకాన్ని పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించింది.

జంతు సంరక్షణ కార్యక్రమాలు

★ ఏటా జనవరిలో జంతు సంరక్షణపై పశు సంవర్ధక శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ పశు గణాలకు వైద్యసేవలు అందిస్తోంది. ★ పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా ఉచితంగా టీకాలు వేసే కార్యక్రమం జులై 6న అన్ని పశువైద్య కేంద్రాల్లో నిర్వహిస్తోంది. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తోంది. ★ వీధి కుక్కల సంఖ్యను నివారించేందుకు స్నేహ యానిమల్ వెల్ఫేర్ సంస్థ ద్వారా పురపాలక సంఘాల పరిధిలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేపడుతోంది. రేబిస్ టీకాలు వేస్తోంది. ★ జులై మొదటి వారంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తూ 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలను రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. ★ పశువుల ఆరోగ్య సంరక్షణకు జాతీయ పశువ్యాధి నివారణ కార్యక్రమంలో టీకాలు వేస్తున్నారు. ఈ వివరాలన్నీ భారత్ పశుధాన్ యాప్‌లో నమోదు చేస్తున్నామని పశుసంవర్ధకశాఖ ఏడీ వైవీ.రమణ తెలిపారు. ★ జంతు సంక్షేమానికి, వాటి హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని, జంతు సంక్షేమ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు.

జిల్లాలో..

బహుళార్థ సాధక పశువుల ఆసుపత్రి	:	1
వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్	:	1
ప్రాంతీయ పశువైద్య కేంద్రాలు	:	13
పశు వైద్యశాలలు	:	65
గ్రామీణ పశు వైద్యశాలలు	:	40
ప్రాంతీయ పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలు	:	6

అబ్కారీశాఖ ఏసీగా పైడా



నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: అబ్కారీ, ప్రొహిబిషన్ శాఖ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)గా పైడా రామచంద్రరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు నుంచి ఆయన బదిలీపై వచ్చారు. గతంలో విజయనగరంలో ఇదే హోదాలో పనిచేశారు.

తపాలా బిల్లల సేకర్తకు అరుదైన గౌరవం



ప్రసాద్‌ను సత్కరిస్తున్న మంత్రి అశ్వినీకుమార్ చౌబే

చీపురుపల్లి, న్యూస్‌టుడే: ప్రపంచవ్యాప్తంగా గాంధీజీపై విడుదలైన తపాలా బిల్లలను సేకరించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన చీపురుపల్లికి చెందిన ఏడీఎన్ఎస్‌వీ.ప్రసాద్‌ను దిల్లీలో గురువారం సత్కరించారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అంతర్జాతీయ స్నాతకోత్సవం, 3వ సెల్ఫీ సైన్స్ మ్యూజియం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయనను ఆహ్వానించారు. కేంద్ర అటవీ, ఆహార, ప్రజాపంపిణీ, పర్యావరణ శాఖల మంత్రి అశ్వనీ కుమార్ చౌబే సత్కరించి అభినందించారు.

వచ్చేనెలలో పత్తి కొనుగోలు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో వచ్చేనెల రెండో తేదీ నుంచి పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్ అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా రైతుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. తన ఛాంబర్లో గురువారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. రాజాం, రామభద్రపురంలో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అన్నదాతలు పంటను కేంద్రాలకు తీసుకొచ్చి, కనీసమద్దతు ధరను పొందేలా చూడాలని కోరారు. మార్కెటింగ్ శాఖ ఏడీ రవికుమార్, అగ్నిమాపక అధికారి రామ్‌ప్రకాష్, తూనికలు కొలతలశాఖ ఏసీ పి.వి.రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెట్ పరీక్షలు ప్రారంభం

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యా అర్హత పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఉదయం నాలుగు కేంద్రాలు, మధ్యాహ్నం మూడు కేంద్రాల్లో పేపర్- 2ఎ(తెలుగు) నిర్వహించారు. 1610 మందికి గానూ 1466 మంది హాజరైనట్లు డీఈవో ప్రేమకుమార్ తెలిపారు.

పూర్తిస్థాయిలో హామీల అమలు: నాగార్జున



మాట్లాడుతున్న కిమిడి, చిత్రంలో ఐవీపీ తదితరులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు కూటమి ప్రభుత్వం సూపర్- 6 పథకాలను పక్కాగా అమలు చేస్తోందని తెదేపా జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. విజయనగరంలోని అశోక్‌బంగ్లాలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వంద రోజుల పాలనలో ఏమీ సాధించలేదంటూ జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. గత అయిదేళ్లలో ప్రజలకు ఏమీ చేయనందునే 151 నుంచి 11 సీట్లకు పడిపోయారని ఎద్దేవా చేశారు. 2019 ఎన్నికల్లో ఫించను మొత్తాన్ని రూ.3 వేలు చేస్తామని ప్రకటించి.. కాలం గడిపేశారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే పెద్దమొత్తంలో పెంచి ఇస్తున్నామని గుర్తు చేశారు. కక్షపూరితంగా మూసేసిన అన్న క్యాంటీన్లను పునరుద్ధరించామన్నారు. భోగాపురంలో విమానాశ్రయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. వాస్తవాలు వక్రీకరించొద్దని హితవు పలికారు. నాయకులు ఐవీపీ.రాజు, విజ్జపు ప్రసాద్, ముద్దాడ చంద్రశేఖర్, రొంగలి పోతన్న, రెడ్డి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	128	226	236

ప్రియురాలితో వచ్చి.. గంజాయితో పట్టుబడి



సరకుతో పోలీసులు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో 21 కిలోల గంజాయితో పశ్చిమ బెంగాల్‌కు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మంజూర్ అలీ సరకు కొనేందుకు ఇటీవల ఒడిశా రాష్ట్రం కొరాపుట్‌కు తన ప్రియురాలితో కలిసి వెళ్లాడు. గురువారం ఉదయం రైలులో విజయనగరం రైల్వే స్టేషన్‌కు చేరకున్నాడు. ఇక్కడి నుంచి ముషీరాబాద్ వెళ్లే రైలు ఎక్కాలనుకున్నాడు. ఈలోపు అల్పాహారం తినేందుకు బయటకు వచ్చాడు. ముందుగానే సమాచారం అందుకున్న పోలీసులు అతని బ్యాగులను తనిఖీ చేయగా.. గంజాయి దొరికింది. సరకుతో పాటు రెండు చరవాణులు, రూ.500 నగదును స్వాధీనం చేసుకున్నామని, అతని ప్రియురాలు తప్పించుకుందని చెప్పారు. సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్సై నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులివ్వలేదని చోదకుడి బలవన్మరణం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉరేసుకుని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సాలూరు మండలం జీగిరాం గ్రామ శివారులోని మామిడితోటలో జరిగింది. గ్రామీణ ఎస్సై నరసింహమూర్తి వివరాల ప్రకారం.. పాచిపెంట మండలం చొక్కాపువానివలసకు చెందిన కె.నందేశ్వరరావు(21) ఆటో చోదకుడు. మద్యానికి బానిసై భార్య నందినితో తరచూ గొడవ పడుతుండేవాడు. గురువారం మద్యం తాగడానికి భార్యను డబ్బులు అడగ్గా.. ఆమె నిరాకరించడంతో ఆటోతో జీగిరాం శివారుకు వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



గుర్ల, న్యూస్‌టుడే: గుర్లలోని పెద్దఖానాలు సమీపంలో గురువారం ఓ ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. విజయనగరం నుంచి చీపురుపల్లి వైపు వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో పొలాల్లోని వెళ్లబోయింది. చోదకుడి చాకచక్యంతో రోడ్డు ఒడ్డున ఆగిపోయింది. 40 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

ఎంపీడీవోలకు పోస్టింగులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో 25 మండలాలకు కొత్త ఎంపీడీవోలను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అంతర జిల్లాల బదిలీ నేపథ్యంలో ఇక్కడకు వచ్చిన వారికి స్థానాలు కేటాయించారు. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి స్థానాల్లో కొత్తవారిని నియమించారు.

పార్వతీపురం మన్యంలో..

మండలం	ఎంపీడీవో
పాచిపెంట	ఉమామహేశ్వరి
జియ్యమ్మవలస	రమామణి
సీతానగరం	త్రివిక్రమరావు
పార్వతీపురం	కె.రూపేష్
కురుపాం	వై.పద్మజ
మక్కువ	డి.స్వరూపరాణి
సాలూరు	ఎ.రమాదేవి

విజయనగరం జిల్లాలో..

మండలం	ఎంపీడీవో
శృంగవరపుకోట	ఎం.సతీష్
జామి	అప్పలనాయుడు
వేపాడ	సూర్యనారాయణ
ఎల్.కోట	ఎస్.అప్పారావు
కొత్తవలస	ఎస్.రమణయ్య
గజపతినగరం	బి.కల్యాణి
దత్తిరాజేరు	రాజేంద్రప్రసాద్
గంట్యాడ	రమణమూర్తి
నెల్లిమర్ల	కె.ఆర్.కె.రాజు
భోగాపురం	కె.కిశోర్‌కుమార్
డెంకాడ	వై.భవాని
గరివిడి	సుబ్రమణ్యం
మెరకముడిదాం	జి.భాస్కరరావు
గుర్ల	కె.సురేష్‌బాబు
రామభద్రపురం	ఎం.రత్నం
బాడంగి	ఎస్.రామకృష్ణ
తెర్లాం	ఆర్.రాంబాబు
మెంటాడ	పట్నాయక్

నాలుగు జిల్లాల దారిలో నరకయాతన




రెల్లిగెడ్డ ఉద్ధృత ప్రవాహంతో కొట్టుకుపోయిన ప్రధాన రహదారి



వరదనీటి ప్రవాహానికి దెబ్బతిన్న కల్వర్టు

విజయనగరం, శ్రీకాకుళం, మన్యం, విశాఖ జిల్లాలకు అనుసంధానంగా ఉన్న సంతకవిటి- పొందూరు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి గత నెలలో వచ్చిన వరదలకు కొట్టుకుపోయింది. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ మార్గంలో ప్రయాణం నరకంలా మారింది. సిరిపురం- లైదాం గ్రామాల మధ్య ఉన్న రెల్లిగెడ్డకు సెప్టెంబరులో వచ్చిన వరదలతో కల్వర్టు, రహదారి కోతకు గురై కొట్టుకుపోయాయి. ఈ గెడ్డ సంతకవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలాల సరిహద్దులో ఉంది. రెండు జిల్లాల ఆర్అండ్‌బీ శాఖ అధికారులు తమ పరిధి కాదంటూ వదిలేశారు. తాత్కాలిక మరమ్మతులైనా చేపడితే ప్రయాణం కొంత సులువవుతుందని వాహన చోదకులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై ర.భ.శాఖ ఏఈ ఆంజనేయనాయకర్‌ను వివరణ కోరగా.. రెల్లిగెడ్డపై ఉన్న వంతెన సంతకవిటి మండల పరిధిలో ఉన్నా.. మండలాధికారులు మాత్రం పొందూరు పరిధిగా చెబుతున్నారన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. అధికారుల సూచన మేరకు శాశ్వత మరమ్మతు పనులకు రూ.25 లక్షలు అవసరమని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. తాత్కాలిక మరమ్మతులకు రూ.2 లక్షలు మంజూరు చేయాలని కలెక్టరును కోరామన్నారు. – న్యూస్‌టుడే, సంతకవిటి

విద్యార్థులకు అపార్ కార్డు



అధికారులు ఇచ్చిన అనుమతి పత్రం

కొత్తవలస, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థికీ జాతీయ స్థాయిలో 'వన్ నేషన్ - వన్ ఐడీ' పేరుతో 17 అంకెలుండే గుర్తింపు కార్డు ఇవ్వడానికి కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. 'ఆధార్' తరహాలోనే 'అపార్' (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పేరుతో దీనికి రూపకల్పన చేశారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లోని కేజీ నుంచి పీజీ వారికి ఇకపై ఈ కార్డు అందుబాటులోకి రానుంది. ముందుగా 9, 10 తరగతుల వారికి వీటిని జారీ చేయాలని నిర్ణయించారు. ఈమేరకు తల్లిదండ్రుల నుంచి అనుమతి పత్రం తీసుకోవాలని విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశించడంతో జిల్లాలో ప్రక్రియను ప్రారంభించారు. దసరా సెలవులకు ముందురోజు తల్లిదండ్రులకు అనుమతి పత్రం ఇచ్చి, దీనివల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు. సెలవుల అనంతరం 14వ తేదీన ఈ పత్రాలను పాఠశాలల్లో అందజేయాలని స్పష్టం చేశారు.

ప్రయోజనాలివీ..

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 17 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు డిజిటల్ కార్డులో ఉంటాయి. ఈ ప్రత్యేక సంఖ్యను నమోదు చేస్తే విద్యార్థి కుటుంబ వివరాలు, మార్కుల ధ్రువపత్రాలు తదితర వివరాలన్నీ తెలుసుకోవచ్చు. ప్రవేశ పరీక్షల దరఖాస్తులోనూ ఈ సంఖ్యను నమోదుచేస్తే సరిపోతుంది. అకడమిక్ పరంగా జీవితకాల గుర్తింపు కార్డుగా దీన్ని పరిగణిస్తారు. ఎల్‌కేజీలో చేరినప్పటి నుంచి విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు అన్ని వివరాలు ఇందులో ఉండనున్నాయి. దీనిని ఆధార్ సంఖ్యతో పాటు అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్(ఏబీసీ) అనే ఎడ్యులాకర్‌కు అనుసంధానిస్తారు. విద్యార్థి బ్యాంకు ఖాతా (అకడమిక్), డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. గుర్తింపు కార్డులకు అడిగిన సమాచారం ఇవ్వాలని తల్లిదండ్రుల సమ్మతిని కోరుతూ సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పత్రాలను పంపారని కొత్తవలస ఎంఈవో బి.శ్రీనివాసరావు చెప్పారు. డీఈవో ప్రేమకుమార్ ఆదేశాల ప్రకారం ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు.

తాటిపూడి నీరు విడుదల

గంట్యాడ, న్యూస్‌టుడే: తాటిపూడి జలాశయం గరిష్ఠ నీటిమట్టం 297 అడుగులు కాగా బుధవారం రాత్రికి 296 అడుగులకు చేరువ కావడంతో గురువారం జలవనరుల శాఖ అధికారులు స్పిల్‌వే ద్వారా నీటిని విడుదల చేశారు. లోతట్టు గ్రామాలను అప్రమత్తం చేసి, సైరన్ మోగించి కిందకు విడిచిపెట్టామని ఏఈ తమ్మునాయుడు తెలిపారు.

సౌందర్య షాపీ ప్రారంభం

విజయనగరం పట్టణం: నగరంలోని పూల్‌బాగ్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సౌందర్య షాపీ 2వ బ్రాంచును మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం ప్రారంభించారు. అన్నిరకాల ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు తమ వద్ద ఉంటాయని సంస్థ అధినేత ఎస్.సంకీర్త్ తెలిపారు.



రిబ్బను కత్తిరిస్తున్న వీరభద్రస్వామి

బొబ్బిలి

●బొబ్బిలి ●రాజాం ●గజపతినగరం ●చీపురుపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి	- 80085 74367
గజపతినగరం	- 80085 74332
రాజాం	- 80085 74308
గరివిడి	- 80085 74348

? పల్లిగండ్రేడు ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి వర్షం నీరు రావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. **- స్థానికులు**

● సమస్యను జిల్లా అధికారులకు నివేదిస్తాం. **- భానుప్రకాష్, ఎంఈవో** – న్యూస్‌టుడే, గుర్ల

? నరవ ఎస్సీ కాలనీ రహదారిపై మురుగునీరు ప్రవహించడంతో దుర్గంధం వెదజల్లుతోంది. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. **- స్థానికులు**

● తక్షణమే పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి మురుగునీరు లేకుండా చర్యలు చేపడతాం. **- శ్రావణి, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? కాగాంలోని కొన్ని వీధుల్లో విద్యుత్తు స్తంభాలు పాడయ్యాయి. ఎప్పుడు విరిగిపడతాయో అని భయమేస్తోంది. **- స్థానిక యువకులు**

● పరిశీలించి, కొత్త స్తంభాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తాం. **- సోమేశ్వరరావు, ఏఈ** – న్యూస్‌టుడే, తెర్లాం

? సీతయ్యపేట ఎస్సీ కాలనీలో బోరు పాడైపోయి ఆరు నెలలైంది. అధికారులకు చెప్పినా బాగు చేయలేదు. **- స్థానికులు**

● బోరు పాడైపోయినట్లు ఫిర్యాదు రాలేదు. బాగు చేయడానికి చర్యలు తీసుకుంటాం. **- రవికుమార్, ఎంపీడీవో** – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

తీగలు సరిచేశారు

స్పందనకు వందనం

గంట్యాడ గ్రామీణం: బుడతనాపల్లి గ్రామంలోని పలు వీధుల్లో కిందకు వేలాడుతున్న విద్యుత్తు తీగలను అధికారులు ఎట్టకేలకు సరిచేశారు. ఇక్కడ సమస్యపై గతనెల 16న 'ఈనాడు'లో 'పొంచి ఉన్న ముప్పు' శీర్షికతో ప్రచురించిన కథనానికి విద్యుత్తు శాఖ అధికారులు స్పందించారు.

నేడు విద్యుత్తుకు అంతరాయం

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి-రణస్థలం ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు పరిధిలోని కోనూరు, శివరాం, అర్తమూరు, తోండ్రంగి గ్రామాలకు విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ ఏఈఈ పి.త్రినాథరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గత నిర్లక్ష్యం.. నిత్యం నరకం

రామభద్రపురం, బాడంగి, న్యూస్‌టుడే

ఐదేళ్ల క్రితం చేపట్టిన రహదారుల నిర్మాణాలు సగంలో ఆగిపోవడంతో ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు. గత ప్రభుత్వం రూ.కోట్లలో బిల్లులు గుత్తేదారులకు ఇవ్వకపోవడంతో వారు వదిలేశారు. బొబ్బిలి నియోజకవర్గంలో నిధుల కొరతతో పనులు చేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


వంగపండువలస మార్గం దుస్థితి

→ ● నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారుల పథకం కింద ఏషియన్ బ్యాంకు నిధులతో 2019లో 21 రహదారుల నిర్మాణానికి రూ.58 కోట్లు మంజూరు అయ్యాయి. బొబ్బిలి మండలంలో 10 రోడ్లు, రామభద్రపురం, బాడంగి మండలాల్లో మూడు చొప్పున, తెర్లాంలో 5 రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వీటిలో కేవలం రెండు మాత్రమే పూర్తయ్యాయి. మిగతా 19 రోడ్లు వివిధ దశల్లో ఆగిపోవడంతో సమస్య ఏర్పడింది.

ఎక్కడెక్కడంటే..?

రామభద్రపురం మండలంలోని కోటశిర్లాం నుంచి ఆర్.చింతలవలస, రామభద్రపురం నుంచి వంగపండువలస, జగన్నాథపురం దారుల్లో కంకర, మెటల్ వేసి వదిలేశారు. అప్పటి బిల్లులు రాలేదని వదిలేశారు. ప్రస్తుతం రాళ్లు తేలిపోయి, గోతులు ఏర్పడ్డ మార్గాల్లో రాకపోకలు చేయడానికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. బాడంగి మండలంలోని గజరాయనివలస, ఏజీపేట, పి.వెంకంపేట, బొబ్బిలి మండలం డొంగురువలస, కుమ్మరవలస నివలస, అన్నంనాయుడుపేట, కొల్లివలస, కింతవానిపేట, ఎం.పనుకువలస, రెడ్డివలస, బంకురువలస, చల్లారపువలస, ఎన్.జనార్దనవలస రహదారుల దుస్థితి ఇంతే. తెర్లాం మండలంలో అరసబలగ, సోమిదివలస మార్గాలు పూర్తికాగా, జన్నివలస, మొదుగువలస రహదారులు నిలిచిపోయాయి.


రాళ్లు తేలిన ఆర్.చింతలవలస రహదారి

డిసెంబరులోగా పూర్తికి చర్యలు

ఈ ఏడాది డిసెంబరు నెలలోగా సగంలో ఆగిన రహదారుల నిర్మాణాలు పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటాం. ఇంతవరకూ గుత్తేదారులకు రూ.14 కోట్ల బిల్లులు చెల్లించాం. చేసిన పనుల మేరకు ఇంకా రూ.4 కోట్లు బకాయి ఉంది. నిధుల కొరతతో సమస్య వచ్చింది. త్వరలో నిధులు రానున్నాయి. పనులు చేయాలని గుత్తేదారులకు సూచించాం. – నాయుడు, పంచాయతీ రాజ్ ప్రాజెక్టు ఏఈ, బొబ్బిలి

అగ్నివీర్‌కు ఎన్సీసీ విద్యార్థులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో చదివి, ఎన్సీసీలో శిక్షణ పొందిన ముగ్గురు విద్యార్థులు అగ్నివీర్‌లో సైనికోద్యోగాలకు ఎంపికయ్యారు. పొదలాపు గణేష్, ముద్దాడ సురేష్, వారాడ కోటేశ్వరరావు ఆర్మీ ఉద్యోగాలు సాధించారు. ఈ ముగ్గురు పాఠశాలలో రెండేళ్లపాటు ఎన్సీసీలో శిక్షణ పొంది పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ప్రవేశార్హత్వాన్ని పొందారు. కొలువులు సాధించిన సందర్భంగా వారిని ఎన్సీసీ అధికారి మామిడి శ్రీనివాసరావు గురువారం అభినందించారు.


శ్రీనివాసరావుతో ఉద్యోగాలు సాధించిన యువకులు

కల్లం కాదు.. రహదారే..!



ఇది చీపురుపల్లి మండలం నిమ్మలవలస- దేవరపోడిలాం- శ్రీకాకుళం జిల్లా పొందూరుకు ప్రధాన రహదారి. ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న కండెలు, గింజలను ఇలా రహదారి పైనే రైతులు ఆరబోస్తున్నారు. అంతర జిల్లా రహదారి కావడంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. - న్యూస్‌టుడే, చీపురుపల్లి గ్రామీణం



సమస్యల పరిష్కారానికి కృషి


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

తెర్లాం, బొబ్బిలి, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి ఆయా శాఖల అధికారులకు పంపిస్తున్నామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రజా దర్బార్‌లో మాట్లాడారు. తాగునీరు, రహదారులు, విద్యుత్తు సమస్యల్ని ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దారు జి.హేమంత్‌కుమార్, ఎంఈవో జె.త్రినాథరావు, పీవో కె.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ● జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తలపెట్టిన ప్రాయశ్చిత్త దీక్ష ముగింపు సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అప్పలస్వామి ఆధ్వర్యంలో బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయం వద్ద జరిగిన పూజల్లో బేబినాయన పాల్గొన్నారు.

ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం

చీపురుపల్లి, రేగిడి, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారంటూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా చీపురుపల్లిలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి విసినిగిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నగర సంకీర్తన, భజన కార్యక్రమాలను గురువారం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, కూటమి నాయకులు ఆర్.కామునాయుడు, ఎం.శ్రీనివాసరావు, ఎ.లక్ష్మనాయుడు తదితరులు పాల్గొన్నారు. ● జనసేన పార్టీ ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి యు.పి.రాజు ఆధ్వర్యంలో రేగిడి మండలంలోని ఉంగరాడ మెట్ట వేంకటేశ్వరాలయంలో భజన నిర్వహించారు. పార్టీ మండల సమన్వయకర్త బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నగర సంకీర్తనలో గద్దె బాబూరావు, కూటమి నాయకులు

'ఇళ్ల నిర్మాణాలను రద్దు చేయండి'


జగనన్న లేఅవుట్‌పై అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: నివాసానికి ఆమోదయోగ్యం కాని ప్రదేశంలో మంజూరు చేసిన ఇళ్లను తక్షణమే రద్దు చేయాలంటూ రావివలస గ్రామస్థులు అధికారులను నిలదీశారు. గురువారం జరిగిన గ్రామ సందర్శన కార్యక్రమంలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులు అధికారులపై మండిపడ్డారు. చెరువును ఆనుకుని ఉండటంతో వర్షాకాలంలో ఇళ్లు నాలుగు అడుగులమేర మునుగుతున్నాయన్నారు. వరదనీరు పోయే మార్గం కూడా లేకపోవడంతో ఉండలేని దుస్థితి నెలకొందని, అధికారులు తక్షణమే పట్టాలతోపాటు ఇళ్లని రద్దు చేయాలన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దారు నీలకంఠేశ్వరరెడ్డి అన్నారు. ఈవో పీఆర్డీ భానోజీరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మళ్లీ అంతరాయం

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలో తాగునీటి సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. గురువారం కోరాడ వీధి, మెహర్, టీఆర్ కాలనీ, మసీదు ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. ఆసుపత్రి రహదారిలో పైపులైను పాడై సమస్య ఏర్పడింది. దీంతో రహదారిని తవ్వి పనులు చేపట్టారు. కొన్నిరోజుల క్రితమే ఇక్కడ మరమ్మతులు చేశారని, మళ్లీ అంతరాయం రావడం ఏంటని పట్టణ వాసులు విసుగుపోతున్నారు. భారీ వాహనాలు తిరగడంతో పైపులైన్లు పాడవుతున్నాయని ఏఈ సురేష్ తెలిపారు.


ఆసుపత్రి రహదారి తవ్వి, మరమ్మతులు

మెగా వైద్య శిబిరం


వృద్ధుడి కంటిని పరీక్షిస్తున్న వైద్యులు

రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురంలో సత్య సేవా సమితి, జిల్లా అంధత్వ సంస్థ ఆధ్వర్యంలో గురువారం మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యుడు బి.వివేక్‌వర్మ ఆధ్వర్యంలో 71 మంది వృద్ధులను పరీక్షించి, 48 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. సత్యసాయి కమిటీ కన్వీనర్ బి.అప్పలస్వామి, శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ● మత్తుపదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని సీఐ నారాయణరావు, ఎస్ఐ ప్రసాదరావు కోరారు. రొంపల్లిలో అవగాహన సదస్సు నిర్వహించారు. యువత మంచి ప్రవర్తనతో మెలగాలన్నారు. సర్పంచి బి.పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవీ.. నమోస్తుతే


ప్రత్యేక అలంకరణలో చీపురుపల్లి మానసాదేవి


గరివిడి పాత రైల్వేగేటు వద్ద కొలువైన అష్టలక్ష్మీ దేవతలు


పిరిడిలో అమ్మవారు

న్యూస్‌టుడే బృందం

శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గామాత విగ్రహాలను గురువారం భక్తులు కొలువు తీర్చారు. గ్రామాల్లో మేళతాళాలతో అమ్మవారి ప్రతిమలను ఊరేగించి పూజలు చేశారు. పసుపు కుంకుమ, చీర, గాజులు సమర్పించారు. తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. చాలా మంది భక్తులు భవానీ దీక్షలు చేపట్టారు. అమ్మవారు తొలిరోజు బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. గంట్యాడ శిడగం వీధిలో ప్రత్యేక సెట్టు వేశారు.


రామభద్రపురంలో తల్లి విగ్రహం ఊరేగింపు


వంగరలో భక్తుల పూజలు



గజపతినగరంలో కలశాల ఊరేగింపు

ఎల్ఐసీ ఏజెంట్ల ఆందోళన


కార్యాలయం ఎదుట నిరసన

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడిలో భారత జీవిత బీమా సంస్థ శాఖా కార్యాలయం ఎదుట గురువారం ఎల్ఐసీ ఏజెంట్లు ఆందోళనకు దిగారు. పాలసీదారుల ప్రయోజనాలకు నష్టం కలిగించే రీతిలో సంస్థలో చేపట్టిన మార్పులను ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. సంఘం గరివిడి శాఖ అధ్యక్షుడు ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోగా రామ్మోహన్



బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి ఆర్డీవోగా వీఎస్ఎస్ రామ్మోహన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా వంశధార యూనిట్-4లో ప్రత్యేక ఉప కలెక్టర్‌గా ఉన్న ఆయన బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ విధులు నిర్వహించిన సాయిశ్రీ కడప జిల్లా జమ్మలమడుగు ఆర్డీవోగా బదిలీ అయ్యారు.

2,800 కిలోల బియ్యం పట్టివేత



చీపురుపల్లి, న్యూస్‌టుడే: మూడు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 2,800 కిలోల పీడీఎస్ బియ్యాన్ని చీపురుపల్లి పోలీసులు గురువారం తెల్లవారుజామున పట్టుకున్నారు. గ్రామాల్లో రేషన్ కార్డుదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని ఆటో, రెండు వ్యాన్లలో తరలిస్తుండగా ముందస్తు సమాచారం మేరకు చీపురుపల్లిలోని నాలుగు రహదారుల కూడలిలో వాహనాలను ఎస్ఐ ఎల్.దామోదరరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. తెర్లాం, ఎచ్చెర్ల, చీపురుపల్లి మండలాల నుంచి బియ్యంతో వాహనాలు వచ్చినట్లు గుర్తించారు. బియ్యం నిల్వలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ మేరకు వాహన చోదకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

గజపతినగరం, న్యూస్‌టుడే: లింగాలవలస గ్రామస్థుడు కె.రామకృష్ణ(56) గురువారం పొలంలో పత్తి మొక్కలకు పురుగుల మందు పిచికారీ చేస్తుండగా పాముకాటుకు గురై మరణించాడు. అక్కడే ఉన్న కుమారుడు శ్రీను గజపతినగరం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.లక్ష్మణరావు చెప్పారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

బొండపల్లి, న్యూస్‌టుడే: బిల్లలవలస జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఇసుక లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న బొండపల్లి గ్రామానికి చెందిన పి.దుర్గారావు, బి.శంకర్ తీవ్రంగా గాయపడగా 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ యు.మహేశ్ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పనుల పరిశీలన

రాజాం, న్యూస్‌టుడే: రాజాం రహదారి విస్తరణ పనులను తెదేపా నియోజకవర్గ నేత కోండ్రు జగదీశ్ నాయకులతో కలిసి పరిశీలించారు. శరవేగంగా పనులు పూర్తి చేస్తామని చెప్పారు. రోడ్లు, భవనాలశాఖ జేఈ నాగభూషణరావు, నాయకులు గురవాన నారాయణరావు, టంకాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

గజపతినగరం, న్యూస్‌టుడే: ఆటోచోదకులు రహదారి నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని సీఐ జీవీఏ రమణ అన్నారు. స్థానిక పోలీసు స్టేషనులో ఎస్ఐ లక్ష్మణరావు ఏర్పాటు చేసిన చోదకుల సమావేశంలో మాట్లాడారు.

ప్రశాంతంగా టెట్ పరీక్ష

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కలవరాయి స్వామి వివేకానంద ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం టెట్ నిర్వహించారు. 90 మందికి 12 మంది గైర్హాజరయ్యారు. ఉప విద్యాశాఖాధికారి మోహనరావు, ఎంఈవో వాసుదేవరావు పర్యవేక్షించారు.

సంక్షిప్త సమాచారం

పుస్తకాల వితరణ

రాజాం, రేగిడి, న్యూస్‌టుడే: యువతకు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను ధీర ఫౌండేషన్ సమకూర్చింది. రాజాం శాఖాగ్రంథాలయం, కంచరాంలోని ప్రజా గ్రంథాలయం, సంతకవిటి, రేగిడి శాఖా గ్రంథాలయాలకు గురువారం వీటిని అందించినట్లు ప్రతినిధులు పి.శ్రీనివాసరావు, డి.వాసుదేవరావులు తెలిపారు.

హక్కులు కల్పించండి

బొండపల్లి, న్యూస్‌టుడే: తాను సాగు చేస్తున్న భూమిపై హక్కులు కల్పించాలంటూ నెలివాడ గ్రామానికి చెందిన బి.బాలాజీ తహసీల్దారుకు వినతి అందించారు. రెవెన్యూ రికార్డుల్లో వేరే వ్యక్తి పేరు ఉందని వాపోయారు.

చెక్కు అందజేత

బొబ్బిలి, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన పి.గురునాయుడు ఇటీవల గాయపడ్డాడు. సీఎం సహాయనిధి నుంచి ఆయనకు విడుదలైన రూ.58 వేల చెక్కును ఎమ్మెల్యే బేబినాయన అందజేశారు.

'ఇవేమి గ్రామసభలు?'

గజపతినగరం, న్యూస్‌టుడే: పంచాయతీలో ఉండే పాలక మండలి సభ్యులు హాజరుకాకుండా, ఎవరికి సమాచారం ఇవ్వకుండా నిర్వహించే గ్రామసభలు సరైనవి కాదని తెదేపా సీనియర్ నాయకుడు పీవీవీ గోపాల రాజు గజపతినగరంన్నరు. సభ్యులకు, ప్రజలకు తెలియజేసి, కోరం సరిపోయినట్లయితే గ్రామ సభ నిర్వహించాలన్నారు.

పాఠశాలలో బుద్ధుని విగ్రహం

గరివిడి, న్యూస్‌టుడే: శేరీపేట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గౌతమ బుద్ధుడు విగ్రహాన్ని కుమారుడు బాలాజీ నాయుడు జ్ఞాపకార్థం దాతలు జమ్ము ఆదినారాయణ, రాజేశ్వరి దంపతులు గురువారం ఏర్పాటు చేశారు.



సర్వేతో అర్హులను గుర్తించండి


కైలాంలో అధికారులతో మాట్లాడుతున్న ప్రమీలా గాంధీ

మెంటాడ, న్యూస్‌టుడే: గ్రామంలో ఇంటింటా సర్వే జరిపి.. బడి ఈడు పిల్లలు, అంగన్‌వాడీ వయసున్న పిల్లలు ఉంటే గుర్తించి, ఆయా కేంద్రాల్లో చేర్పించాలని ప్రత్యేకాధికారి ప్రమీలాగాంధీ అధికారులకు సూచించారు. గ్రామ సందర్శనలో భాగంగా గురువారం మెంటాడ మండలం కైలాంలో పర్యటించి, అధికారులతో మాట్లాడారు. ● **గజపతినగరం:** సచివాలయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని జిల్లా ఉప అభివృద్ధి అధికారి పి.కిరణ్ కుమార్ కొత్తబగ్గాంలో అన్నారు. ఎంపీడీవో కిశోర్‌కుమార్, ఏపీడీ జనార్దనరావు తదితరులు ఉన్నారు. ● **రేగిడి:** అంబకండికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు ఎంపీడీవో శ్యామలాకుమారి, అధికారులను కోరారు. ● **చీపురుపల్లి గ్రామీణం, సంతకవిటి, రామభద్రపురం:** చీపురుపల్లి మండలం పెదనడిపల్లిలో ప్రత్యేకాధికారి రాజేశ్వరి, సంతకవిటి మండలం జావాంలో ఎంపీడీవో సురేష్‌కుమార్, దత్తిరాజేరులోని ఎం.లింగాలవలసలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, రామభద్రపురంలోని కొత్తరేగలో ఎంపీడీవో రమామణి, ఎంఈవో తిరుమల ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ సభలు జరిగాయి.

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట



కానుకలు లెక్కిస్తున్న భక్తులు, తల్లి సేవకులు

పైడితల్లి హుండీ ఆదాయం లెక్కింపు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు విజయనగరం పైడితల్లి అమ్మవారి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 29 రోజులకు గానూ చదురుగుడి నుంచి రూ. 10,54,690, 12.100 గ్రాముల బంగారం, 131 గ్రాముల వెండి వచ్చిందన్నారు. కొందరు భక్తులు పాత, నకిలీ నోట్లు సమర్పించారని, సరికాదని దేవస్థానం సహాయ కమిషనర్ ప్రసాదరావు తెలిపారు.

యోగ ఛాంపియన్‌షిప్‌లో సత్తా

నేరవార్తావిభాగం: పోలీసు శాఖలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎం.దుర్గాప్రసాద్ ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఆలిండియా పోలీసు యోగాసన ఛాంపియన్‌షిప్ 2024- 25 పోటీల్లో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా గురువారం తన కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.



దుర్గాప్రసాద్ మెడలో పతకం వేసి, అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

సమస్యలుంటే చెప్పండి.. పరిష్కరిస్తాం

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజలు వారి సమస్యలు తెలియజేసేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. గురువారం 13వ డివిజన్‌లోని కొత్తపేటలో 15 డివిజన్లకు సంబంధించి గ్రీవెన్స్ నిర్వహించారు. 98 వినతులు వచ్చాయని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎక్కువగా పింఛన్లకు సంబంధించిన ఫిర్యాదులు అందాయని, కాలువలు, రోడ్లు, తాగునీరు తదితర సమస్యలపైనా అర్జీలు ఇచ్చారని చెప్పారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యలుంటే నేరుగా తనకు తెలియజేయొచ్చని భరోసానిచ్చారు. నాయకులు ఐవీపీ.రాజు, ప్రసాదుల వరప్రసాద్, బంగారుబాబు, పిళ్లా విజయ్‌కుమార్, ఇమంది సుధీర్ తదితరులు పాల్గొన్నారు. ● అనంతరం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద మెప్మా అర్బన్ మార్టును ఎమ్మెల్యే ప్రారంభించారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

రూ.1.20 కోట్లతో పైడితల్లి ఉత్సవాలకు ఏర్పాట్లు

నగరపాలిక కమిషనర్ నల్లనయ్య

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం



ముఖాముఖి

జిల్లా కేంద్రంలో ఈనెల 13, 14వ తేదీల్లో విజయనగరం ఉత్సవాలు జరగనున్నాయి. 15న పైడితల్లి సిరిమానోత్సవం, ముందు రోజు రాత్రి తొలేళ్లు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నడూ లేని విధంగా రూ.1.20 కోట్లతో ఏర్పాట్లు చేస్తున్నామని నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య తెలిపారు. సిరిమాను తిరిగే మార్గాల్లో ఇప్పటికే రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభించామని, 10 నాటికి పూర్తిచేస్తామని చెప్పారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఎక్కడికక్కడే తాగునీటి సౌకర్యం కల్పించనున్నామన్నారు. పండగ రోజుల్లో స్థానికులకు రోజూ నీటి సరఫరా ఉంటుందని వెల్లడించారు. ఈమేరకు గురువారం 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో పలు వివరాలు వెల్లడించారు.

20 చోట్ల తాగునీటి కేంద్రాలు

ఉత్సవాల నేపథ్యంలో నగరంలోని అన్ని ప్రాంతాలకూ నీళ్లు అందిస్తాం. విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా జనరేటర్లను తీసుకొస్తున్నాం. తొలేళ్లు, సిరిమానోత్సవం రోజుల్లో భక్తుల కోసం 20 చోట్ల తాగునీటి సదుపాయం కల్పిస్తాం. రంగుమారకుండా ఉండేందుకు క్లోరిన్, బ్లీచింగ్ నిల్వలను సిద్ధం చేశాం. అమ్మవారి కోవెల, గంటస్తంభం, కోట కూడలి, అయోధ్య మైదానం, పాత బస్టాండ్, సింహాచలం మేడ, బాలాజీ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ రోడ్, ఐస్‌ఫ్యాక్టరీ కూడలి, తదితర చోట్ల నీళ్ల కేంద్రాలు ఉంటాయి.



ఉల్లివీధి నుంచి కాళ్లనాయుడు మందిరం వరకు రూ.12.40 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం

అన్నిచోట్లా వెలుగులు..

నగరపాలికలో 23 వేల వీధిదీపాలున్నాయి. అన్నీ పూర్తిస్థాయిలో వెలిగేలా చూస్తాం. అదనంగా సెంటర్ డివైడర్లు, కూడళ్లు, ప్రధాన మార్గాలను విద్యుత్తు దీపాలతో అలంకరిస్తాం. 120 వరకు బయో మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తాం. అవసరమైన చోట వాటిని వినియోగించనున్నాం. సాంస్కృతిక వేదికల వద్ద ఎక్కువగా పెడతాం. సిరిమాను తిరిగే మార్గంలో 12 శిథిల భవనాలను గుర్తించి, హెచ్చరికలు పెట్టాం. ఆయా భవనాల యజమానులకు నోటీసులిచ్చాం. వాటిపైకి ఎవరూ ఎక్కకూడదని ఆదేశాలు జారీ చేశాం.

సుందరీకరణపై దృష్టి..

నగరంలో సుందరీకరణపై దృష్టిసారించనున్నాం. అన్ని సెంటర్ డివైడర్లకు రంగులు వేయిస్తున్నాం. 16 చోట్ల గోడలపైన బొమ్మలు గీయిస్తున్నాం.

30 మంది సిబ్బంది..

పారిశుద్ధ్య పనులకు 430 మంది సిబ్బందిని వినియోగించనున్నాం. మూడు షిఫ్టుల్లో విధుల్లో ఉంటారు. వారంతా ఏక రూప దుస్తులు ధరిస్తారు. రథం తిరిగే సమయంలో భక్తులు విసిరే అరటిపండ్లు, ఇతర పూజా సామగ్రిని తొలగించేందుకు 100 మందిని వినియోగిస్తాం. చెత్త తరలింపు వాహనాలు, డంపర్ బిన్లు, పుష్‌కార్టులను అందుబాటులో ఉంచుతాం.

స్వాగత ద్వారాలు

నగరంలోని ఆరు ప్రాంతాల్లో పెద్ద స్వాగత ద్వారాలు, అయిదు చోట్ల చిన్నవి ఏర్పాటు చేస్తున్నాం. ఏజెన్సీల ద్వారా 12 చోట్ల హోర్డింగులు పెడుతున్నాం. అయోధ్య మైదానం, ఎంఆర్ కళాశాల వసతిగృహ మైదానం, బొంకులదిబ్బ, రాజీవ్ స్టేడియం, ఇండోర్ స్టేడియం, పెద్దచెరువు వద్ద ఏర్పాటు విద్యుత్తు వెలుగులతో కూడిన పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేస్తున్నాం. ఆహార కల్తీ నిరోధక శాఖతో కలిసి పండగ రోజుల్లో హోటళ్లు, ఇతర దుకాణాల్లో దాడులు ఉంటాయి.

పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న కమిషనరు అప్పలరాజు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నెల్లిమర్ల ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్ పనులను వేగవంతం చేయాలని కమిషనరు కె.అప్పలరాజు సూచించారు. గురువారం క్యాంటీన్ పనులను ఆయన పరిశీలించారు. అన్ని మౌలిక సదుపాయాలతో అనుకున్న గడువులోగా నిర్మాణం పూర్తిచేసి అప్పగించాలని గుత్తేదారుడిని ఆదేశించారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఈనెల 6, 7, 8వ తేదీల్లో జరగనున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభల గోడపత్రికలను గురువారం కలెక్టర్ అంబేడ్కర్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. మహాసభలకు భగత్‌సింగ్ మేనల్లుడు, పంజాబ్ విశ్వవిద్యాలయం ఉపకులపతి జగ్ మోహన్‌సింగ్ రానున్నారని ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు కలెక్టర్‌కు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యావేత్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బంద ఆక్రమణలు తొలగించాలి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ముషిడిపల్లి పంచాయతీలో రెవెన్యూ అధికారులు గుర్తించిన జగన్నాథ బంద ఆక్రమణలు తొలగించడానికి అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వైస్ ఎంపీపీ ఐదుకూరి సుధారాజు ప్రశ్నించారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. జిందాల్ పరిశ్రమ భూముల మధ్యలో ఉన్న మిలటరీ పట్టాకు రెవెన్యూ అధికారులు ఎలా ఎన్‌వోసీ ఇచ్చారని ప్రశ్నించారు. దానికి సంబంధించిన జీవో ప్రతులు ప్రదర్శించారు.



జీవో ప్రతులతో వైస్ ఎంపీపీ తదితరులు

ప్రమాదం అంచున ప్రయాణం



డెంకాడ మండలంలోని చొల్లంగిపేట నుంచి నగరప్పేట మీదుగా ఏ.పాలెం వెళ్లే రహదారి అధ్వానంగా దర్శనమిస్తోంది. రహదారి నిర్మించి సుమారు రెండేళ్లు అయింది. బెడ్డలు ఊడిపోయి గుంతలతో ప్రమాదకరంగా తయారైంది. ప్రయాణం ప్రమాదకరంగా ఉందని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ర.భ.శాఖ జేఈ రవికుమార్ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, డెంకాడ

చెత్త కదలదు.. దుర్వాసన తప్పదు

నగరంలో పలుచోట్ల డంపర్ బిన్లు చెత్తతో నిండి కనిపిస్తున్నాయి. వాటి చుట్టూ పందులు, కుక్కలు చేరి సమస్యను మరింత జఠిలం చేస్తున్నాయి. కొన్నిచోట్ల బిన్లు పాడవడంతో వ్యర్థాలు కిందపడి, దుర్వాసన వస్తోంది. తోటపాలెం, బాలాజీనగర్, సిద్ధార్థనగర్ తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. బాలాజీనగర్ దాబా దగ్గర కొన్నిరోజులుగా చెత్తను తరలించలేదని స్థానికులు చెబుతున్నారు. కార్మికులను పంపించి, తొలగించేలా ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి అన్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం



బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసి బదిలీపై వెళ్తున్న అధికారులు, సిబ్బందికి తహసీల్దార్ ప్రసాదరావు ఆధ్వర్యంలో గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బొండపల్లి వెళ్తున్న ఉప తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎస్.కోట వెళ్తున్న మండల సర్వేయర్ గ్రంధి రామ, సీనియర్ సహాయకుడు మనోజ్, మరో 10 మందిని సత్కరించారు.



ఉపతహసీల్దారుకు సత్కారం

ఉపాధ్యాయులకు వెన్నుదన్నుగా ఏపీటీఎఫ్

భోగాపురం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 80 వసంతాల వేడుకలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.శరత్‌కుమార్ కోరారు. గురువారం రావాడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ఫూల్‌బాగ్‌లో ఈనెల 6, 7, 8 తేదీల్లో నిర్వహించే కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరవ్వాలన్నారు. ఉపాధ్యాయులు వీఎస్ఎన్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

'నాడు - నేడు' ప్రచారానికే : ఎమ్మెల్యే

కొత్తవలస, న్యూస్‌టుడే: 'నాడు-నేడు' కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల రూపురేఖలు మార్చేస్తామని గొప్పలు చెప్పిన వైకాపా ప్రభుత్వం ఏ పనినీ పూర్తిచేయలేదని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి విమర్శించారు. కొత్తవలస పీహెచ్‌సీ నిర్మాణ పనుల్ని గురువారం ఆమె పరిశీలించారు. కొత్తవలస, వియ్యంపేట, లక్కవరపుకోట, అలమండ, జామిలో పీహెచ్‌సీ భవనాలు పూర్తిచేయడానికి కృషి చేస్తానని ఆమె చెప్పారు. ర.భ.శాఖ జేఈ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎస్.రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దృష్టి దినోత్సవం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ వెబినార్ నిర్వహించారు. అమెరికాలోని ఆపిల్ విజన్ సైంటిస్ట్ డా. దిబ్యేందు పుస్తి ప్రసంగించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వామి కంటి ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా.కుమారస్వామి మాట్లాడారు. డీన్ విజయ్‌బాబు, ఆప్టోమెట్రీ విభాగాధిపతి సౌరజిత్ కుమార్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుమారస్వామి

దుర్గాదేవీ నమోస్తుతే



వంగరలో బాలాత్రిపుర సుందరిగా దుర్గమ్మ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం తెల్లవారుజామునే భక్తులు ఆయా గ్రామాల్లోని దుర్గాదేవి అమ్మవారి ఆలయాల్లో పూజలు చేశారు. యువత, చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా ఉత్సవ మండపాలు ఏర్పాటు చేశారు. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. భవాని మాలధారులు భక్తిశ్రద్ధలతో దీక్ష ఆచరిస్తున్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్, గ్రామీణం, ఎల్.కోట, నెల్లిమర్ల, జామి



న్యూపూర్ణ కూడలిలో ఏర్పాటైన భారీ మండపం



జామిలో అమ్మవారు..



రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రత్యేక రూపంలో..



ఎల్.కోట: మారాపల్లిలో కోలాటం



కొణిసివీధిలో ఊరేగింపు..



నెల్లిమర్ల: భైరవద్వీపం సెట్టు

సంక్షిప్త సమాచారం

గడువు పెంపు

ఉడాకాలనీ: జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ పథకం కింద రుణం మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 15 వరకు పొడిగించినట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ జగదీష్ తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన కర్రోతు

విజయనగరం అర్బన్: మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు గురువారం కలెక్టర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తదితరులున్నారు.

అవగాహన కల్పించండి



విజయనగరం పట్టణం: ఏపీఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారి కింజరాపు వెంకట రామకృష్ణ ప్రసాద్ గురువారం విజయనగరంలోని విజిలెన్స్ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. విద్యుత్తు చౌర్యం జరగకుండా ముందుగా గుర్తించి కేసులు నమోదు చేయాలని విజిలెన్స్ ఇన్‌స్పెక్టరు కె.కృష్ణను ఆదేశించారు. ఎస్ఈ ఎం.లక్ష్మణరావు తదితరులున్నారు.

నెల్లిమర్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

విజయనగరం అర్బన్, నెల్లిమర్ల: నెల్లిమర్ల నియోజకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెదేపా రాష్ట్ర పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ కలెక్టర్ అంబేడ్కర్‌ను కోరారు. గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

సమస్యలు పరిష్కరించాలి

భోగాపురం: తపాలా శాఖలో ఉన్న ఏళ్లనాటి సమస్యలను పరిష్కరించాలని భోగాపురం తపాలాశాఖ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు నిరసన చేశారు. ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. బ్రాంచి పోస్టుమాస్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అరెస్టు

కొత్తవలస: తాడివానిపాలేనికి చెందిన పి.మనోహర్‌ను అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీ కోసం కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ సీహెచ్.షణ్ముఖరావు గురువారం తెలిపారు. అదేగ్రామానికి చెందిన భర్త చనిపోయిన యువతిని ప్రేమ పేరుతో మోసం చేసి పెళ్లి చేసుకోలేదని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. అతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మద్యం సీసాలు స్వాధీనం

నెల్లిమర్ల: జరజాపుపేటలో అక్రమ గొలుసు దుకాణం ద్వారా మద్యం అమ్మకాలు చేపడుతున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై గణేష్ తెలిపారు. అతని వద్ద 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

జీతాలు పెంచాలని డిమాండు



ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు పెంచి, వారి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండు చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద ఏపీ మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘ సభ్యులు ధర్నా చేపట్టారు. అశోక్ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారని, రూ.10 వేల చొప్పున గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. అప్పలరాజు, అప్పారావు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

అయ్యన్నపేట/మయూరికూడలి, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నవతరోత్సవ కార్యక్రమాల్లో భాగంగా గురువారం నగరంలోని ఓ ప్రైవేటు వేడుకామందిరంలో బహుమతుల ప్రదాన కార్యక్రమం జరిగింది. సుమారు 300 మంది విజేతలకు అందజేసినట్లు అధ్యక్షుడు నాగేశ్వరరావు తెలిపారు. శంకర్‌రెడ్డి, మూర్తి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నూతన చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: నూతన చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని పోలీసు శిక్షణ కళాశాల సీఐ కె.వెంకటేశ్వరరావు అన్నారు. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం భారత న్యాయ సంహిత నూతన చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షణ కళాశాల సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.వాసుదేవరావు, న్యాయవాది కుమారస్వామి, కళాశాల ఉప ప్రధానాచార్యుడు జి.జె.నాగరాజు, ఎన్ఎస్ఎస్ అధికారి ఎ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

జామి, నెల్లిమర్ల, విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: జామి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని శాసనపల్లి ఫీడర్‌లో మరమ్మతు పనులు చేస్తున్నందున శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ జి.సురేష్‌బాబు గురువారం తెలిపారు. ● నెల్లిమర్ల 11 కేవీ వాటర్ వర్క్స్ ఫీడర్‌లో విద్యుత్తు నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ పి.త్రినాధ్‌రావు తెలిపారు. ● నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం నగరంలో ఉదయం 8 నుంచి ఒంటి గంట వరకు ఇందిరానగర్, బ్యాంక్ కాలనీ, శ్రీరామ్ కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతం, రైల్వే స్టేషన్‌లో విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ పి.త్రినాథరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.